# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

బుధవారం, హైదరాబాద్ 09.04.2025 | 24 క్యారెట్లు 89,478.00 | కిలో వెండి 1,03,789.00 | 38 ℃ | సంపుటి:3 | సంచిక:168

www.vishalabharati.com




## చెన్నైకు వరుసగా నాలుగో ఓటమి

- ఆఖరి వరకూ పోరాడినా దక్కని ఫలితం
- 18 పరుగులతో పంజాబ్ కింగ్స్ విజయం

..మిగతా 3 లో

## చిన్న తప్పు చేసినా వీసా రద్దు

### అమెరికా నుంచి వెళ్లిపోవాలని హుకుం

- విద్యార్థులపై ట్రంప్ సర్కార్ కఠిన చర్యలు
- ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడినా వీసా రద్దు చేస్తున్నట్టు విద్యార్థుల ఆరోపణ
- ప్రశ్నార్థకంగా తెలుగు విద్యార్థుల భవిష్యత్

విశాలభారతి, స్టేట్ బ్యూరో:



అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలని కలలు కంటున్న భారతీయ విద్యార్థులకు పరిస్థితులు అనుకూలంగా లేవు. ఒకప్పుడు ఎంతో ఆశావహంగా కనిపించిన అమెరికా కల, ఇప్పుడు ఆందోళనలు, భయాలతో నిండిన పీడకలగా మారుతోంది. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా వచ్చాక మారిన పరిస్థితులు, కొత్త విధానాలు, కఠినమైన వీసా నిబంధనలు, పెరుగుతున్న జీవన వ్యయం, ఉద్యోగ అవకాశాలు తగ్గిపోవడం వంటి కారణాల వల్ల

..మిగతా 2 లో

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఈటెల?

### నేడో రేపో అధికారిక ప్రకటన



- రాజకీయవర్గాల్లో విస్తృత చర్చ
- బీసీల చుట్టూ రాష్ట్ర రాజకీయాలు
- అందుకే ఆ వర్గానికి చెందిన ఈటలకే అధ్యక్ష పదవి
- వచ్చే ఎన్నికల నాటికి పార్టీ మరింత బలోపేతం
- కేంద్ర మంత్రులుగా కిషన్ రెడ్డి , బండి బిజీ బిజీ

తెలంగాణ అధ్యక్షుడి నియామకంపై గత కొన్నిరోజులుగా బీజేపీ అధినాయకత్వం కసరత్తు చేస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్ర బీజేపీ పగ్గాలు ఎవరి చేపడతారా అన్న ఉత్కంఠ గత కొన్ని రోజులుగా కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలోనే రాష్ట్ర అధ్యక్షుడ్ని బీజేపీ అధినాయకత్వం ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఆ పార్టీ ముఖ్యనేత, మాల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ ను కొత్త అధ్యక్షుడిగా నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. రేపు (బుధవారం) సాయంత్రం దీనిపై అధికారిక ప్రకటన రానున్నట్లు రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతోంది.

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణలోని పవర్ ఫుల్ బీసీ నేతల్లో ఈటెల రాజేందర్ ముందు వరుసలో ఉంటారు. ప్రస్తుతం తెలంగాణ రాజకీయాలు సైతం బీసీల చుట్టే తిరుగుతోంది. బీసీల రిజర్వేషన్ అంటూ ఇటీవల అధికార కాంగ్రెస్ పార్టీ.. ఢిల్లీలో మహాధర్నా సైతం నిర్వహించింది. రాష్ట్రంలో బీసీలకు ప్రాధాన్యత పెరుగుతున్న దృష్ట్యా ఆ వర్గానికి చెందిన నేతకు పార్టీ అధ్యక్ష పగ్గాలు ఇస్తే బాగుంటుందని బీజేపీ అధిష్టానం భావించినట్లు సమాచారం. ఈటెలకు అధ్యక్ష పగ్గాలు అప్పజెప్పడం ద్వారా వచ్చే ఎన్నికల నాటికి పార్టీని సంసిద్ధం చేయాలని కాషాయ అధినాయకత్వం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

..మిగతా 2 లో



## 52 కోట్ల మందికి ముద్ర రుణాలు

- రూ.33 లక్షల కోట్లకు పైగా పంపిణీ
- ప్రధాని నరేంద్ర మోడీ
- పదేళ్లు పూర్తిచేసుకున్న ముద్రా

3 లో

## ఆ రాక్షసులకు ఉరే సరి

- అది తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు
- నిందితులు దేశంపై యుద్ధం ప్రకటించారు
- దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ల కేసులో హైకోర్టు చరిత్రాత్మక తీర్పు
- ఎన్ఐఏ కోర్టు తీర్పును ధ్రువీకరించిన ద్విసభ్య ధర్మాసనం
- ముద్దాయిల క్రిమినల్ అప్పీల్ పిటిషన్లు డిస్మిస్
- ఒకేసారి ఐదుగురికి ఉరి శిక్ష విధించడం ఇదే తొలిసారి



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన దిల్‌సుఖ్‌నగర్ జంట బాంబు పేలుళ్ల కేసులో ఐదుగురు దోషులకు ఉరిశిక్ష విధిస్తూ 2016 డిసెంబరు 13న ఎన్ఐఏ కోర్టు వెలువరించిన తీర్పును హైకోర్టు సమర్థించింది. ఐదుగురు దోషులు వేర్వేరుగా దాఖలు చేసుకున్న క్రిమినల్ అప్పీల్ పిటిషన్లను ద్విసభ్య ధర్మాసనం కొట్టేసింది. చట్టప్రకారం కింది కోర్టు ఎవరికైనా ఉరిశిక్ష విధిస్తే, ఆ వ్యక్తులు అప్పీలు చేసినా చేయకపోయినా ఉరిశిక్ష విధింపు తీర్పును హైకోర్టు ధ్రువీకరించాల్సి ఉంటుంది. దీంతో ఈ కేసులో ఎన్ఐఏ కోర్టు నుంచి వచ్చిన నివేదనను (రెఫర్డ్ అప్పీల్‌ను) హైకోర్టు ఆమోదిస్తూ జస్టిస్ కే లక్ష్మణ్, జస్టిస్ పీ శ్రీసుధలతో కూడిన హైకోర్టు ధర్మాసనం మంగళవారం చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. ఒకేసారి

..మిగతా 2 లో

## 10 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్

- గంటల తరబడి నిరీక్షణకు చెక్
- అమల్లోకి స్లాట్ బుకింగ్ సదుపాయం
- 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రేపటి నుంచి అమలు
- చట్ట సవరణతో డబుల్ రిజిస్ట్రేషన్లకు చెక్
- ప్రజలే తయారుచేసుకునేలా సేల్‌డీడ్ మాడ్యూల్
- ప్రతిరోజూ అందుబాటులోకి 48 స్లాట్స్
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ సరళతరం చేసేందుకు సర్కారు చర్యలు తీసుకుంటోంది. ప్రజలకు సమర్థవంతంగా సులువుగా, వేగవంతంగా, పారదర్శకంగా, అవినీతి రహితంగా మరింత మెరుగైన సేవలు అందించేందుకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆధునీకరిస్తోంది. ఇందులో భాగంగానే డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కోసం గంటల తరబడి నిరీక్షించే

..మిగతా 2 లో



## గురుకులాల్లో కోడింగ్ కోర్సులు

- యూకే ఫౌండేషన్‌తో సర్కారు ఒప్పందం
- 6వ తరగతి నుంచి ఇంటర్ వరకూ శిక్షణ
- వెల్లడించిన సోషల్ వెల్ఫేర్ సెక్రటరీ వర్షిణి

2 లో




## ముంపుపై సీడబ్ల్యూసీతో సర్వే

- థర్డ్ పార్టీతో చేయించేందుకు ఒప్పుకున్న ప్రాజెక్టు అథారిటీ
- జాయింట్ సర్వేకు ఏపీ ప్రభుత్వం ససేమిరా
- తెలంగాణ డిమాండ్లకు ఒప్పుకోబోమని పేచీ
- ఒక్క కిన్నెరసానిపైనే ఉమ్మడి సర్వేకి ఒప్పుకోలు
- అన్నింటికీ పాత సర్వేలున్నాయని వితండ వాదన

..మిగతా 2 లో

## 'హెచ్‌సీయూ' భూముల వెనుక భారీ కుంభకోణం

- 2 రోజుల్లో మొత్తం బయటపెడతా
- కాంగ్రెస్, బీజేపీల జాయింట్ సీఎం రేవంత్
- ఏఐ వీడియోల పేరుతో రచ్చ చేస్తుండు
- జాతీయ పార్టీలతో ఒరిగేదేం లేదు
- మీడియాతో చిట్‌చాట్‌లో కేటీఆర్



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ) భూముల వివాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బాంబు పేల్చారు. వివాదాస్పద 400 ఎకరాల కంచ

..మిగతా 2 లో



## కేటీఆర్, రేవంత్ ప్రాణ స్నేహితులు

- ఇద్దరూ కలిసి రాష్ట్రాన్ని దోచేస్తున్నారు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రహస్య ఒప్పందం
- కేటీఆర్ జైలుకెళ్లకుండా కాపాడుతున్నది రేవంతే
- కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్

2 లో

# బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఈటెల?

తరువాయి భాగం: తెలంగాణ బీజేపీకి కీలకంగా ఉన్న బండి సంజయ్, కిషన్ రెడ్డి వంటి ముఖ్య నేతలు.. ప్రస్తుతం కేంద్రమంత్రులుగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. దీంతో వారు పార్టీకి సమయాన్ని కేటాయించలేక పోతున్నట్లు చర్చ జరుగుతోంది. దీనివల్ల పార్టీ శ్రేణుల్లో ఒక విధమైన అయోమయం తలెత్తుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఒక బలమైన నేతకు అధ్యక్ష పగ్గాలు ఇవ్వాలని బీజేపీ అధినాయకత్వం భావించింది. ఈ క్రమంలో రాష్ట్రం నుంచి అధ్యక్ష రేసులో పలువురు పేర్లు సైతం వినిపించాయి. ఈ క్రమంలో ఈటెల పేరును ఖరారు చేసినట్లు నెట్టింట ప్రచారం జరగడం ఆసక్తికరంగా మారింది.ఈటెలకు అధ్యక్ష పగ్గాలు ఇవ్వడం ద్వారా.. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ను టార్గెట్ చేయవచ్చని బీజేపీ భావిస్తున్నట్లు సమాచారం. ఈటెల రాజకీయం మొత్తం గతంలో బీఆర్ఎస్ చుట్టూనే తిరిగింది. రాష్ట్ర అవతరణ అనంతరం ఆర్థిక, ఆరోగ్య మంత్రిగానూ ఈటెల పనిచేశారు. అయితే కేసీఆర్ తో తలెత్తిన విభేదాల కారణంగా ఈటెల పార్టీని వీడి బయటకొచ్చారని అప్పట్లో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. పార్టీని వీడాక కేసీఆర్ పై ఈటెల తీవ్రస్థాయిలో విమర్శలు సైతం గుప్పించారు. ఈ నేపథ్యంలో ఈటెలకు అధ్యక్ష పగ్గాలు అప్పగించడం ద్వారా కేసీఆర్ కు సైతం చెక్ పెట్టవచ్చని కాషాయ దళం భావించి ఉండొచ్చని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అలాగే బీసీ రిజర్వేషన్లపై కేంద్రంతో కొట్లాడుతున్న రేవంత్ రెడ్డికి కూడా చెక్‌పెట్టే ఆలోచనతోనే ఈటలకు అధ్యక్ష బాధ్యతలు అప్పజెబుతున్నట్లు చర్చ జరుగుతోంది.

# ఆ రాక్షసులకు ఉరే సరి

తరువాయి భాగం

ఐదుగురు దోషులకు ఉరిశిక్షను ఖరారు చేయడం హైకోర్టు చరిత్రలో ఇదే తొలిసారి. అమాయకులను లక్ష్యంగా చేసుకుని దోషులు ఉగ్రదాడికి పాల్పడ్డారని, ఇది వ్యక్తులపైనే కాకుండా సభ్య సమాజంపై జరిగిన దాడి అని హైకోర్టు పేర్కొన్నది. పిల్లలు, ఆడవాళ్లు అనే కనికరం లేకుండా బాంబు దాడులకు పాల్పడటం అసాధారణ నేరమని వ్యాఖ్యానించింది. ఓ మహిళ, ఆమె గర్భంలో ఉన్న శిశువు సహా 18 మందిని పొట్టనబెట్టుకున్న దోషులకు ఉరిశిక్ష విధించడం సరైనదేనని స్పష్టం చేసింది.

**ఐదుగురు దోషులకు ఉరిశిక్ష**

ఈ కేసులో ప్రధాన నిందితుడు మహమ్మద్ రియాజ్ అలియాస్ రియాజ్ భత్కల్ పరారీలో ఉన్నాడు. మిగిలిన ఐదుగురు దోషులైన అసదుల్లా అక్తర్ అలియాస్ హడ్డి అలియాస్ తబ్రెజ్ అలియాస్ డేనియల్ అలియాస్ అసద్, జియా ఉర్ రెహమాన్ అలియాస్ వఘాస్ అలియాస్ జావేద్ అలియాస్ అహ్మద్ అలియాస్ నబీల్ అహమ్మద్, మహ్మద్ తహసీన్ అక్తర్ అలియాస్ హసన్ అలియాస్ మోను, మహమ్మద్ అహ్మద్ సిద్ధిబప అలియాస్ యాసిన్ భత్కల్ అలియాస్ షారుఖ్, ఇజాజ్ షేక్ అలియాస్ సమర్ అర్మాన్ తుండె అలియాస్ సాగర్ అలియాస్ ఇజాజ్ సయ్యద్ షేక్‌లకు ఎన్ఐఏ కోర్టు విధించిన మరణశిక్షను హైకోర్టు సమర్థించింది.

## 'హెచ్‌సీయూ' భూముల వెనుక
# భారీ కుంభకోణం

తరువాయి భాగం

గచ్చిబౌలి భూముల అమ్మకంలో పెద్ద స్కామ్ ఉందన్నారు. వేల కోట్ల విలువ చేసే భూముల వేలం వెనుక పెద్ద బాగోతమే ఉందని చెప్పారు. ఈ వ్యవహారంలో తెర వెనుక ఓ ఎంపీ కూడా ఉన్నారని కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వేల కోట్ల రూపాయాల బాగోతం 2,3 రోజుల్లో బయటపెడతాన న్నారు. మంగళవారం మీడియాతో కేటీఆర్ చిట్ చాట్ మాట్లాడారు. ఈ సందర్భంగా హెచ్‌సీయూపై ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. కేటీఆర్ చెబుతున్న పెద్ద స్కామ్ ఏంటి? దాని వెనుక ఉన్న ఎంపీ ఎవరు? ఎంపీకి సీఎం రేవంత్‌కు ఏం సంబంధం? అన్నది సోషల్‌మీడియాతో పాటు రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది.

**ఏఐ అంటే అనుముల ఇంటెలిజెన్స్**

చిట్ చాట్‌లో కేటీఆర్ మాట్లాడుతూ 'ఏఐ అంటే అనుముల ఇంటెలిజెన్స్ అని మేము అనొచ్చు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. హెచ్‌సీయూ వివాదంలో తాము పోస్ట్ చేసిన వాస్తవాలను ఏఐ వీడియోలు అని చెప్పి తప్పించుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో నెగెటివ్ పాలసీలు, నెగెటివ్ పాలిటిక్స్ నడుస్తున్నాయి. మాజీ సర్పంచ్ నుంచి మాజీ సీఎం వరకు కేసులెలా పెట్టాలని చూస్తున్నారు. ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంలో మేం లేము. హెచ్‌సీయూ విద్యార్థులపై కేసుల ఉపసంహరణ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. కేసుల ఉపసంహరణ సరిపోదు. భూముల చదును సందర్భంగా జంతువధ కారకులపైనా కేసులు పెట్టాలి. సోషల్ మీడియాలో మాపై ఎదురుదాడి చేయిస్తున్నారు. భారీగా ఖర్చు చేసి టూల్ కిట్ సాయంతో ఎదురుదాడికి పాల్పడుతున్నారు. బీసీ రిజర్వేషన్లు అసాధ్యమనే కాంగ్రెస్ దీక్షకు రాహుల్ గాంధీ వెళ్లలేదు' అని కేటీఆర్ గుర్తు చేశారు.

'తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ రెండు జాతీయ పార్టీల నేతల జుట్టు ఢిల్లీ చేతుల్లోనే ఉంటుంది. ఒకరు చెప్పులు మోస్తే.. ఇంకొకరు బ్యాగులను మోస్తున్నారు. 16, 17 నెలలైనా సీఎం రేవంత్ మంత్రివర్గాన్ని విస్తరించుకునే పరిస్థితి లేదు. ఇన్నిసార్లు ఢిల్లీ వెళ్లినా ఒక్క రూపాయి కూడా తేలేదు. మీనాక్షి నటరాజన్ సచివాలయంలో రివ్యూలు చేస్తున్నారు. రేవంత్ విఫల సీఎం కాబట్టే కాంగ్రెస్ హైకమాండ్ జోక్యం చేసుకుంటోంది. నాకు దక్కనిది ఎవరికీ దక్కకూడదని రేవంత్ ఆలోచిస్తున్నారు. కంచ గచ్చిబౌలి భూముల వెనుక వేల కోట్ల బాగోతం ఉంది. కంచ గచ్చిబౌలి భూముల వెనుక బీజేపీ ఎంపీ కూడా ఉన్నారు. వేల కోట్ల రూపాయాల బాగోతం 2,3 రోజుల్లో చెబుతా. రేవంత్ రెడ్డి కాంగ్రెస్, బీజేపీ ఉమ్మడి సీఎం. దేశంలోని పవర్ ఫుల్ సీఎంల్లో రేవంత్ నంబర్ వన్‌గా ఉండాలి అని కేటీఆర్ ఆకాంక్షించారు. గోదావరి, కృష్ణా జలాల్లో విచ్చలవిడి జలదోపిడీ జరుగుతోంది. భూకంపం, భారీ వరద వచ్చినా మేడిగడ్డ చెక్కు చెదరలేదు. కేసీఆర్‌పై కోపంతో నీళ్లు సముద్రంలోకి వదిలేశారు. పంటలు ఎండుతున్నాయి. ఆదిత్యనాథ్‌దాస్‌ను నీటి పారుదల శాఖ సలహాదారుగా పెట్టుకున్నారు. ఆదిత్యనాథ్‌దాస్ గతంలో ఏపీ తరపున వాదించారు. దాస్ నియామకం ఏపీ ప్రయోజనాల కోసమా..? ఏపీ, చంద్రబాబు కోసమే ఆదిత్యనాథ్‌ను నియమించారా..? కృష్ణాలో అన్ని జలాశయాలు నిండాయి. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే పంటలు ఎండుతున్నాయి' అని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.



# 52 కోట్ల మందికి ముద్ర రుణాలు

విశాలభారతి, నేషనల్ బ్యూరో:

దేశవ్యాప్తంగా 33 లక్షల కోట్ల రూపాయలకుపైగా రుణాలు ముద్ర యోజన కింద ఇచ్చినట్లు ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. ఎలాంటి సెక్యూరిటీ సమర్పించకుండానే రుణాలు ఇచ్చామని చెప్పారు. తద్వారా అసంఖ్యాకమైన వ్యక్తులు తమ వ్యాపార నైపుణ్యాలను ప్రదర్శించడానికి వీలు ఏర్పడిందని పేర్కొన్నారు. పీఎం ముద్ర యోజన 10వ వార్షికోత్సవం సందర్భంగా లబ్ధిదారులతో తన నివాసంలో సమావేశమైన మోదీ, ఆ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు.

ముద్ర యోజన అనేక మందిని ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యోగ ప్రదాతలుగా మారేందుకు దోహదం చేసిందని ప్రధాని అన్నారు. ముద్రా లబ్ధిదారులలో సగం మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు చెందినవారు ఉన్నారని, 70 శాతానికిపైగా మహిళలు ఉండటం చాలా సంతోషంగా ఉందని మోదీ పేర్కొన్నారు. మహిళలు ఎక్కువ రుణాల పొందడమే కాకుండావాటిని తిరిగి చెల్లించడంలోనూ ముందున్నారని ప్రధాని కొనియాడారు. ఈ పథకాన్ని సమీక్షించి, మరింత మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. రాబోయేకాలంలో ప్రతి ఔత్సాహిక పారిశ్రామికవేత్తకు రుణ సదుపాయం కల్పించే బలమైన వ్యవస్థను ఏర్పాటు చేయడంపై. తమ ప్రభుత్వం దృష్టిసారిస్తుందని మోదీ వివరించారు. "మీ నుంచి కోరుకునేది మీరు ఐదు, పది మందికి ఉద్యోగాలు ఇస్తున్నారు. ఆ ఐదు, పది మంది ముద్రా రుణాలు తీసుకుని వ్యాపారాలు చేసేలా ప్రేరణ ఇవ్వండి. వారిలో ధైర్యం నింపండి. వారిలో విశ్వాసం కలుగుతుంది. దేశంలో 52 కోట్ల రుణాలు మంజూరయ్యాయి. 52 కోట్ల మందికి కాదు. సురేష్ చెప్పాడు ముందు రెండున్నర లక్షలు తీసుకున్నాను. తర్వాత 9 లక్షల తీసుకున్నాను. అలా రెండు లోన్లు. 52 కోట్ల రుణాలు మంజూరు కావడం చాలా పెద్ద విషయం" అని మోదీ తెలిపారు, ప్రపంచంలోనే ఏ దేశంలో కూడా ఇలాంటి ఆలోచన సైతం చేసి ఉండరని అన్నారు. అందుకే దేశ యువత సిద్ధం కావాలని, కొంత వ్యాపారం చేయగలిగితే అప్పుడు చాలా ప్రయోజనం పొందుతారని తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్ర్రాలు ప్రారంభించిన
# డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి

మునుగోడు,విశాలభారతి:

మునుగోడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలని, మునుగోడు గూడపూర్ కచలాపురం పులిపల్పుల ఊకోండి గ్రామాలలో మంగళ వారం ఉమ్మడి నల్లగొండ జిల్లా డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రం లోని వరి ధాన్యాన్ని అమ్ముకోవాలని రైతులకు సూచించారు దళారులను నమ్మి అమ్మి మోసపోవద్దన్నారు కొనుగోలు కేంద్రంలోని విక్రయిస్తే మద్దతు ధర లభిస్తుందన్నారు.వరి ఏ గ్రేడ్ ధాన్యానికి 2320 రూపాయలు సన్న



వరి ధాన్యం పండించిన రైతులకు అదనంగా 500 రూపాయలు బోనస్ ఇస్తామన్నారు అందచేత ప్రతి ఒక రైతు ప్రభుత్వం నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలోనే ధాన్యాన్ని అమ్ముకోవాలన్నారు ఈ కార్యక్రమంలో చండూరు మార్కెట్ చైర్మన్ దోటి నారాయణ, ఎంపీడీవో, వ్యవసాయ అధికారి పద్మజ, డిప్యూటీ తాసిల్దార్ నేలపట్ల నరేష్, ఏఈఓ మౌనిక, మానిటరింగ్ ఆఫీసర్ జ్యోతిర్మయి, గ్రామపంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ రెడ్డి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ పాలకవర్గ సభ్యులు, దుబ్బ గోపాల్, జిట్టగోని యాదయ్య, వట్టి కోటి వెంకటేశ్వర్లు, మేకల మల్లయ్య, మరియు సిబ్బంది కార్యదర్శి పాలకూరి సుఖేందర్, కొనుగోలు కేంద్ర ఇన్చార్జి దుబ్బ పురుషోత్తం ,నన్నూరి అశోక్ రెడ్డి అకౌంటెంట్,అనిల్, పరమేష్ మండల పార్టీ కాంగ్రెస్ అధ్యక్షులు భీమనపల్లి సైదులు, పట్టణ అధ్యక్షులు అరేళ్ళ సైదులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాల్వాయి చెన్నారెడ్డి మాజీ ఎంపీటీసీ పందుల భాస్కర్ మాజీ సర్పంచ్ మిర్యాల వెంకన్న,రైతులు తదితరులు పాల్గొన్నారు

# 'పోలవరం' ముంపుపై సీడబ్ల్యూసీతో సర్వే

విశాలభారతి, స్టేట్ బ్యూరో:



పోలవరం ప్రాజెక్టు వెనుక జలాల ముంపు ప్రభావంపై ప్రైవేటు ఏజెన్సీతో సర్వేకు పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) ప్రాథమికంగా అంగీకారం తెలిపినట్లు తెలిసింది. కేంద్ర జలసంఘంతో చర్చించి ముందుకెళ్లనున్నట్లు స్పష్టంచేసినట్లు సమాచారం. సుప్రీంకోర్టు, జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్జీటీ) ఆదేశాల మేరకు ముంపు ప్రాంతాలపై సంయుక్త సర్వే చేయాలని తెలంగాణ డిమాండ్ చేసింది. పూర్తిస్థాయి సంయుక్త సర్వేకు ఏపీ ముందుకు రాకపోవడంతో ఈ మేరకు పీపీఏ నిర్ణయించినట్లు సమాచారం. 2020లో ఎన్జీటీ ఆదేశాలు, 2022లో సుప్రీంకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో సీడబ్ల్యూసీ నేతృత్వంలో నాలుగుసార్లు జరిగిన సాంకేతిక సమావేశాలకు కొనసాగింపుగా హైదరాబాద్‌లో మంగళవారం పీపీఏ సమావేశం జరిగింది. అథారిటీ ఛైర్మన్ అతుల్‌జైన్ అధ్యక్షత వహించగా తెలంగాణ తరఫున నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ అనిల్‌కుమార్, గోదావరి బేసిన్ డిప్యూటీ డైరెక్టర్ సుబ్రహ్మణ్యప్రసాద్, ఏపీ తరఫున జలవనరులశాఖ సీఈలు నర్సింహమూర్తి, సుగుణాకర్‌రావు, ఎస్ఈ రవికుమార్ హాజరయ్యారు. పోలవరం ప్రాజెక్టు కారణంగా వెనుక జలాలతో ఏర్పడుతున్న ముంపును తేల్చాలని, ఛత్తీస్‌గఢ్‌లో చేపట్టిన తీరులో ప్రైవేటు ఏజెన్సీతో సర్వే చేయాలని తెలంగాణ కోరింది. ఏపీ స్పందిస్తూ ప్రాజెక్టును 41.15 మీటర్ల స్థాయిలో నిర్మిస్తున్నందున ముంపు ఉండదని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కిన్నెరసాని, ముర్రేడు పరీవాహకంలో మాత్రమే సర్వే చాలని పేర్కొంది. న్యాయస్థానాల ఉత్తర్వుల మేరకు పూర్తిస్థాయి సర్వే చేయాల్సిందేనని తెలంగాణ పట్టుబట్టింది. ప్రైవేటు ఏజెన్సీతో సర్వే చేయిస్తామని పీపీఏ ఛైర్మన్ పేర్కొన్నట్లు సమాచారం. పోలవరం ప్రాజెక్టు నుంచే బనకచర్లకు నీటిని తరలించేందుకు ఏపీ ఆ ప్రాజెక్టును చేపడుతుండగా పీపీఏ ఎందుకు స్పందించడం లేదని తెలంగాణ అభ్యంతరం వ్యక్తంచేసింది.

# కేటీఆర్, రేవంత్..ప్రాణ స్నేహితులు

- **ఇద్దరూ కలిసే రాష్ట్రాన్ని దోచేస్తున్నారు**
- **కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రహస్య ఒప్పందం**
- **కేటీఆర్ జైలుకెళ్లకుండా కాపాడుతున్నది రేవంతే**
- **హెచ్‌సీయూ భూములపై సీబీఐ విచారణకు సిద్ధమా..?**
- **కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్**

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇద్దరూ జాన్ జబ్బాలని (ప్రాణస్నేహితులు).. ఇద్దరూ కలిసే రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జైలుకు వెళ్లకుండా కాపాడుతోంది సీఎం రేవంత్ రెడ్డేనని ఆరోపించారు. మంళవారం నాడు బండి సంజయ్ ఓ ప్రకటన విడుదల చేశారు. డీలిమిటేషన్‌పై చెన్నైలో జరిగిన సమావేశానికి కేటీఆర్, రేవంత్ రెడ్డి కలిసే వెళ్లారని... హైదరాబాద్‌లో త్వరలో జరగబోయే సమావేశానికీ ఇద్దరూ కలిసే ప్లాన్ చేస్తున్నారని బండి సంజయ్ ఆరోపించారు. ఇద్దరూ కలిసే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎంపీలతో ఓటు వేయించారని ఆరోపించారు. కాంగ్రెస్ కోసం గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను నిలబెట్టలేదని... రేవంత్‌కు ప్రయోజనం చేకూర్చేందుకు కేటీఆర్ ఈ విధంగా చేశారని ఆరోపించారు.

హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి మజ్లిస్ పార్టీ అభ్యర్థిని గెలిపించేందుకు సిద్ధమయ్యాయని ఆరోపించారు. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు గుణపాఠం చెప్పినా కేటీఆర్ బుద్ధి మారలేదని విమర్శించారు. తెలంగాణలో బీజేపీ అవకాశాలను దెబ్బతీసేందుకు రేవంత్ రెడ్డి, కేటీఆర్ కుట్ర పన్నుతున్నారని బండి సంజయ్ ఆరోపణలు చేశారు. హెచ్‌సీయూ భూములపై సీబీఐ విచారణకు సిద్ధమా? అని రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బండి సంజయ్ ప్రశ్నించారు. కేంద్రంలో ఉన్నది కేసీఆర్, రేవంత్ రెడ్డి పాలన కాదని.. నీతి, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనమైన ప్రధాని మోడీ సర్కార్ అని హెచ్చరించారు. అవినీతిపరులు, భూ దోపిడీదారులపై ఉక్కుపాదం మోపే మోదీ పాలన కొనసాగుతోందన్నారు. సీబీఐ విచారణకు సిద్ధపడితే హెచ్‌సీయూ భూములను దోచుకునేందుకు ఎవరు కుట్రలు చేస్తున్నారో, వారికి ఎవరు సహకరిస్తున్నారనే విషయాలన్నీ బయటకు వస్తాయన్నారు. మరి కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు సీబీఐ విచారణ కోరే దమ్ముందా అని ప్రశ్నించారు.

# 10 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్

తరువాయి భాగం

పనిలేకుండా కేవలం 10 నుంచి 15 నిమిషాల వ్యవధిలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాఫీగా పూర్తయ్యేలా స్లాట్ బుకింగ్ విధానం అమల్లోకి తీసుకురాబోతోంది. రాష్ట్రంలో 144 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా మొదటి దశలో ప్రయోగాత్మకంగా 22 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ నెల 10వ తేదీ నుంచి స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలులోకి తీసుకురాబోతున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.హైదరాబాద్‌లోని ఆజంపుర, చిక్కడపల్లి, సంగారెడ్డి జిల్లా సదాశివపేట, మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్, వల్లభ్‌నగర్, రంగారెడ్డి జిల్లా శంషాబాద్, సరూర్‌నగర్, చంపాపేట్, పెద్దపల్లి జిల్లా రామగుండం, ఖమ్మం జిల్లా కూసుమంచి, ఖమ్మం (R.O), మేడ్చల్ (R.O), మహబూబ్‌నగర్ (R.O), జగిత్యాల, నిర్మల్, వరంగల్ ఫోర్ట్, వరంగల్ గ్రామీణం, కొత్తగూడెం, ఆర్మూర్, భువనగిరి, చౌటుప్పల్, నాగర్‌కర్నూల్ మొత్తం 22 చోట్ల ఈ కార్యక్రమానికి తాము శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒకేరోజు ఒకే సమయంలో ఎక్కువ దస్తావేజులు రిజిస్ట్రేషన్ కోసం సమర్పించడం వల్ల జరిగే జాప్యం నివారించేందుకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ రోజువారీ పని వేళలను 48 స్లాట్లుగా విభజించడం జరిగిందన్నారు. ప్రజలు నేరుగా registration.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా తమకు అనుకూలమైన తేదీ, సమయానికి స్లాట్ బుక్ చేసుకుని ఆ రోజు నిర్దేశించిన సమయానికి నేరుగా విచ్చేసి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని వెంటనే వెళ్లిపోవచ్చని సూచించారు. స్లాట్ బుక్ చేసుకోని వారి కోసం ఏదైనా అత్యవసర సందర్భాలలో ప్రతి రోజు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు, ఐదు వాక్ ఇన్ రిజిస్ట్రేషన్లను అనుమతిస్తారని, నేరుగా కార్యాలయానికి వచ్చిన వారికి ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో ఆ దస్తావేజులు స్వీకరిస్తారని మంత్రి పొంగులేటి తెలిపారు.సాధారణంగా పని ఒత్తిడి ఎక్కువగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం సులభతరం చేయడం, 48 స్లాట్స్ కన్నా ఎక్కువ స్లాట్స్ అవసరం ఉన్న కార్యాలయాల్లో ఇప్పుడున్న సబ్ రిజిస్ట్రార్లకు తోడుగా అదనపు సబ్ రిజిస్ట్రార్లను ప్రభుత్వం నియమించనుంది. ప్రయోగాత్మకంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ కార్యాలయంలో అదనంగా ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు, సిబ్బందిని నియమించిన దృష్ట్యా 144 స్లాట్స్ అందుబాటులో ఉంటాయి. స్లాట్ బుకింగ్ విధానం దృష్టిలో పెట్టుకొని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్నిర్మాణం చేస్తోంది. అధిక రద్దీ, తక్కువ రద్దీ ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిని అనుసంధానం చేసి పని భారం సమానం చేయడానికి చర్యలు తీసుకుంటుంది. ఈ విధానం ముందుగా రంగారెడ్డి జిల్లా చంపాపేట, సరూర్‌నగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల అధికార పరిధిని విలీనం చేసింది.

రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రజలు అవగాహన లేమి కారణంగా ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా దస్తావేజులు తయారు చేసుకోవడానికి వీలు కల్పిస్తూ ప్రభుత్వం వెబ్‌సైట్‌లోనే ఒక మాడ్యూల్ ప్రవేశపెట్టింది.

# గురుకులాల్లో కోడింగ్ కోర్సులు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

గురుకులాల్లో కోడింగ్ కోర్సులు ప్రవేశపెడుతున్నట్లు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్ట్యూట్స్ కార్యదర్శి అలుగు వర్షిణి పేర్కొన్నారు. సోషల్ వెల్ఫేర్ గురుకులాల్లో 2025 26 అకడమిక్ నుండి పూర్తిస్థాయిలో కోడింగ్ కోర్సులు అందుబాటులోకి వస్తాయని ఆమె వివరించారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ కోడింగ్ కోర్సుల కోసం ఐదేళ్ల పాటు విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ను అందించేందుకు ఆ ర్ ఫీఎఫ్, యూకే ఫౌండేషన్ తో ఎంఓయూ చేశామని వివరించారు.

ఆరవ తరగతి నుంచి ఇంటర్ వరకు కోడింగ్ పై శిక్షణ ఇస్తామన్నారు. విద్యార్థుల అభిరుచులు, ఆశయాలు ఆధారంగా ఈ ట్రైనింగ్ నిర్వహిస్తామన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో 238 పాఠశాలల్లో కోడింగ్ ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. గత ఏడాది కేవలం ఒక్క మొయినాబాద్ పాఠశాల మాత్రమే ఉన్నదని, దీన్ని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలలకు విస్తరింపచేయాలని సంకల్పించినట్లు వెల్లడించారు. లండన్‌కు చెందిన సంస్థ విద్యార్థుల కరిక్యులమ్, యాక్షన్ ప్లాన్, మానిటరింగ్, పెడగోజీ వంటి అంశాలపై తమతో డిస్కషన్ చేస్తుందన్నారు. ఏఐ, కోడింగ్, మెషీన్ లెర్నింగ్, రోబోటిక్స్, ఆన్ లైన్ టూల్స్ సంబంధించిన సిలబస్ ను నేర్పించేందుకు ప్రిపరేషన్ జరుగుతుందన్నారు. అన్ని పాఠశాలలోని దాదాపు లక్షా 52 వేల మందికి కంప్యూటింగ్ పై ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది దాదాపు 250 మంది విద్యార్థులు ఒక లైవ్ ప్రాజెక్టులో పనిచేసే అవకాశాన్ని పొందుతారని వివరించారు. ఈ మేరకు కంప్యూటర్ ల్యాబరేటీస్‌ను కూడా సిద్ధం చేసినట్లు వెల్లడించారు.ఈ కోడింగ్ ద్వారా అప్లికేషన్లు, వెబ్‌సైట్లు, సాఫ్ట్‌వేర్లు రూపొందించవచ్చన్నవారు. పైథాన్, స్క్రాచ్, జావా, హెచ్‌టీఎంఎల్, ఇలా తదితర చాలా కంప్యూటర్ ప్రోగ్రామింగ్ భాషలు ఉంటాయని వెల్లడించారు.



## కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా బొల్లగాని సుబ్బు గౌడ్

**పాలకీడు, విశాలభారతి:**

పాలకవీడు మండలం కోమటి కుంట గ్రామానికి చెందిన బొల్లగాని సుబ్బు గౌడ్ ను కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎన్ విసుబ్బారావు, మాజీ జెడ్పీటీసీ మాలోత్ మోతిలాల్ నాయక్ నియామకం పత్రం అందజేశారు. ఈసందర్భంగా బొల్లగాని సుబ్బు గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరిన అతికొద్ది కాలంలోనే గుర్తించి కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గా నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎన్.వి.సుబ్బారావు కి, మాజీ ఎంపీపీ భూక్యా గోపాల్ నాయక్ కి,మాజీ జెడ్పీటీసీ మాలోత్ మోతిలాల్ నాయక్ కి,జిల్లా నాయకులు బైరెడ్డి జితేందర్ రెడ్డికి, వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లంకొండ నరసింహారావుకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల నాయకులు నీమా నాయక్,ఉపేందర్,భూక్యా నాగరాజు,సందీప్,శ్రీనివాస్ ఆంజనేయులు,బుచ్చయ్య, నాగరాజు,రమేష్,బాలసైదులు,సైదా,నాని తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

**తిరుమలగిరి, విశాలభారతి:**

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం పాటిమట్ల X రోడ్ వద్ద సోమవారం రాత్రి తీవ్ర విషాదం చోటుచేసుకుంది. రాత్రి 10 గంటల సమయంలో జరిగిన రోడ్డుప్రమాదంలో తిరుమలగిరి మండలం తొండ గ్రామానికి చెందిన వయసు 26 , చెరుకు రాంబాబు అనే యువకుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, తొండ గ్రామానికి చెందిన చెరుకు రాంబాబు అనే యువకుడు రాత్రి మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలోని గ్రామం కొండగడప వద్ద బంధువు చనిపోగా దహన సంస్కారాలు ముగించుకొని తిరిగి బైక్‌పై స్వగ్రామం తొండకు వస్తున్న క్రమంలో పాటిమట్ల x రోడ్ వద్ద ధర్మారం గ్రామానికి చెందిన వ్యక్తి టాటా ఐస్ వాహనాన్ని వెనుక నుంచి రాంబాబు బలంగా ఢీకొట్టాడు. ప్రమాదములో తీవ్ర గాయాలు కావడం తో రాంబాబు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఇంకా పెళ్లి కాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్టు తెలిపారు.

## రజతోత్సవ సభపై రాజకీయాలు వద్దు

- **బహిరంగ సభతో బిఆర్ ఎస్ కు పూర్వ వైభోగం**
- **అపోహాలను నమ్మొద్దు అన్ని పర్మిషన్లతోనే సభ నిర్వహణ**
- **బిఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షులు బొంకూరి కార్తిక్**



**విశాలభారతి, ఎల్కతుర్తి:**

బిఆర్ఎస్ రజతోత్సవ భారీ బహిరంగ సభ నిర్వహణలో ఎలాంటి అనుమానాలు లేవని పూర్తిగా పర్మిషన్ తోనే సభ జరుగుతుందని అన్నారు బిఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షులు బొంకూరి కార్తిక్ మంగళవారం రోజున మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నీళ్లు ,నిధులు, నియామకాల,కోసము ఏర్పడిన పార్టీ బిఆర్ఎస్ పార్టీ అని తెలిపారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి సుదీర్ఘ కాలము కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం 9 సంవత్సరాల పాటు కెసిఆర్ నాయకత్వంలో పాడిపంటలతో సమృద్ధిగా అభివృద్ధి చెందిందని ఎలాంటి నీటి కష్టాలు ఇబ్బందులు కలగాకుండా విద్య ,వైద్యము, పారిశ్రామిక రంగాలలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానం లో నిలిచిందని తెలిపారు. మోసపూరితమైన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంకు 16 నెలల పరిపాలన నిండక ముందే రాష్ట్రంలో కరువు తొండవించిందని ఎద్దేవా చేశారు కరువు కష్టాలకు కాంగ్రెస్ పార్టీతో విడదీయరాని బంధం ఉందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలనకు వరకు కరువు కష్టాలు కేరాఫ్ గా నిలిచిందని పేర్కొన్నారు 24వ వసంత పూర్తిచేసుకుని 25వ వసంతంలోకి అడుగు పెడుతున్న తరుణంలో రైతులకు పర్యావరణ ప్రకృతికి ఇలాంటి విఘాతం కలిగించకుండా సభ నిర్వహణ ఏర్పాట్లు చేస్తుంటే జీర్ణించుకోలేని కొంతమంది కాంగ్రెస్ పార్టీ నాయకులు తప్పుడు ద్రోవ పట్టించడం కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని ఎటువంటి ఆటంకాలు సృష్టించిన సభ మరో కుంభమేళా తరహాలో జరగబోతుందని అన్నారు.

## చిన్న తప్పు చేసినా వీసా రద్దు

**తరువాయి భాగం**

భారతీయ విద్యార్థులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. కొంతమంది విద్యార్థులు అతి వేగంగా వాహనం నడిపినందుకు లేదా సోషల్ మీడియాలో ప్రభుత్వ వ్యతిరేక పోస్టులు పెట్టినందుకు వీసాలు రద్దు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల విద్యార్థులు చిన్న పొరపాటు జరిగినా తమ భవిష్యత్తు అంధకారమవుతుందని ఆందోళన చెందుతున్నారు."నేను ఎప్పుడూ భయంతో బతకాల్సి వస్తోంది. ఇక్కడ ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు. మా భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉంది" అని ఓ విద్యార్థి ఆవేదన వ్యక్తం చేశాడు. పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక విద్యార్థి మాట్లాడుతూ, "మా స్నేహితుడు ఒక చిన్న ట్రాఫిక్ ఉల్లంఘన కారణంగా తన వీసాను కోల్పోయాడు. అతను వెంటనే భారతదేశానికి తిరిగి వెళ్లాల్సి వచ్చింది. ఇది చాలా దారుణంగా ఉంది" అని చెప్పాడు.అమెరికాలోని కొన్ని కళాశాలలు అంతర్జాతీయ విద్యార్థుల వీసాల రద్దుకు సంబంధించిన సంఘటనలు పెరుగుతున్నాయని ధృవీకరించాయి. ముఖ్యంగా భారతీయ విద్యార్థులు ఎక్కువగా ప్రభావితమవుతున్నారని తెలిపాయి. దీనికి తోడు, అమెరికాలో చదువుకోవడం చాలా ఖరీదైన వ్యవహారం. ట్యూషన్ ఫీజులు, వసతి ఖర్చులు, ఆహార ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. దీని కారణంగా చాలామంది విద్యార్థులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

ఉద్యోగాల విషయంలోనూ నిరాశ ఎదురవుతోంది. చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగం పొందడం అంత సులభం కాదు. వీసా నిబంధనలు కఠినంగా ఉండటం, కంపెనీలు విదేశీయులను నియమించడానికి వెనకాడటం వంటి కారణాల వల్ల ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయి. దీనివల్ల చాలామంది విద్యార్థులు చదువు పూర్తి చేసుకుని కూడా స్వదేశానికి తిరిగి వెళ్లాల్సి వస్తోంది. భారత కేంద్ర ప్రభుత్వం ఈ సమస్యలను గుర్తించి, విద్యార్థులకు సహాయం చేయడానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.





# చెన్నైకు వరుసగా నాలుగో ఓటమి

**విశాలభారతి, స్పోర్ట్స్ బ్యూరో:**

ఐపీఎల్ 2025లో పంజాబ్ కింగ్స్ జోరు కొనసాగుతుంది. చండీఘర్ వేదికగా మంగళవారం (ఏప్రిల్ 8) చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్ లో 18 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ టోర్నీలో నాలుగు మ్యాచ్ ల్లో పంజాబ్ కు ఇది మూడో గెలుపు కాగా.. ఐదు మ్యాచ్ ల్లో చెన్నైకి ఇది నాలుగో ఓటమి. భారీ ఛేజింగ్ లో కాన్వే (49 బంతుల్లో 69: 6 ఫోర్లు, 2 సిక్సర్లు), దూబే (42) పోరాడినప్పటికీ.. లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో చెన్నై సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 201 పరుగులు మాత్రమే చేయగలిగింది.


220 పరుగుల లక్ష్య ఛేదనలో చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్ ను ధాటిగా ప్రారంభించింది. ఓపెనర్లు రచిన్ రవీంద్ర (36), డెవాన్ కాన్వే తొలి వికెట్ కు 39 బంతుల్లో 61 పరుగులు జోడించి శుభారంభం అందించారు. పవర్ ప్లే తర్వాత 36 పరుగులు చేసిన రచీన్ రవీంద్ర మ్యాక్స్ వెల్ బౌలింగ్ లో స్టంపౌటయ్యాడు. ఈ టోర్నీలో పేలవ ఫామ్ లో ఉన్న గైక్వాడ్ ఒక పరుగే చేసి పెవిలియన్ కు చేరాడు. దీంతో చెన్నై స్వల్ప వ్యవధిలో 2 వికెట్లు కోల్పోవడంతో కష్టాల్లో పడింది.


ఈ దశలో చెన్నై సూపర్ కింగ్స్ ను కాన్వే, శివమ్ దూబే ఆదుకున్నారు. మూడో వికెట్ కు 89 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి పరిస్థితిని చక్కదిద్దారు. అయితే కొట్టాల్సిన రన్ రేట్ ఎక్కువగా ఉండడంతో వేగంగా ఆడడంలో ఈ జోడీ విఫలమైంది. దీంతో దూబే భారీ షాట్ కు ప్రయత్నించి బౌల్డయ్యాడు. మరో ఎండ్ లో కాన్వే 37 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నా వేగంగా ఆడలేకపోయాడు. దీంతో చెన్నై లక్ష్యానికి చాలా దూరంలో ఆగిపోయింది. ఇక ఎప్పటిలాగే ధోనీ (12 బంతుల్లో 2 సిక్సర్లతో 27) చివర్లో మెరుపు ఇన్నింగ్స్ ఆడినా ఫలితం లేకుండా పోయింది. పంజాబ్ బౌలర్లలో లాకీ ఫెర్గుసన్ రెండు వికెట్లు తీసుకున్నాడు. యష్ ఠాకూర్, మ్యాక్స్ వెల్ కు తలో వికెట్ లభించింది.

అంతక ముందు మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ భారీ స్కోర్ చేసింది. ఓపెనర్ ప్రియాంష్ ఆర్య(42 బంతుల్లో 103:7 ఫోర్లు, 9 సిక్సర్లు) సెంచరీతో దుమ్మురేపడంతో పాటు శశాంక్ సింగ్(36 బంతుల్లో 52: 2 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరుపు హాఫ్ సెంచరీ తోడవడంతో నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. ఓపెనర్ ప్రియాంష్ ఆర్య టాప్ స్కోరర్ గా నిలిచాడు. చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్లలో ఖలీద్ అహ్మద్, రవి చంద్రన్ అశ్విన్ తలో రెండు వికెట్లు తీసుకున్నారు. ముకేశ్ చౌదరీ, నూర్ అహ్మద్ తలో వికెట్ పడగొట్టారు.













విశాల భారతి
తెలుగు దిన పత్రిక
బుధవారం,
09.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



vishalabharathi Telugu Daily

## ఘనంగా భూపాల్ నాయక్ జన్మదిన వేడుకలు



**నర్సింహులు పేట, విశాలభారతి:**
మండల కేంద్రంలో నర్సింహులు పేట మండల కోఆర్డినేటర్ చల్లమల్ల గణేష్ ఆదిర్వంలో ప్రజలు మెచ్చిన సేవకుడు కిసాన్ పరివార్ అధ్యక్షులు భూపాల్ నాయక్ 40 వ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని వారి అభిమానులు వివిధ మండల కేంద్రాలలోని దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేసి సేవ దృప్పదం చాటుకున్నారు. వివిధ మండల కేంద్రాల్లో మొక్కలు నాటడం, పేదలకు చేయూత అందించడం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేస్తూ ఆలయాల్లో, చర్చి లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# GENERAL NEWS

# రైతుల కోసమే ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

- రాయినిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిన సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ చైర్మెన్ కొప్పుల వేణారెడ్డి.



**సూర్యాపేట,విశాలభారతి:**
రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకోని రైతుల కోసమే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయడం జరుగుతుందని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని రాయిని గూడెం(11వ వార్డు) లో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో నాటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. తేమయంత్రాలు, ప్యాడి క్లీనర్లు, కాంటాలు, టార్పాలిన్లు, గన్ని బ్యాగులు కొరత లేకుండా చూడాలని సెంటర్ నిర్వాహకులను ఆదేశించారు.ధాన్యాన్ని ఆరబెట్టి తేమశాతం తక్కువగా ఉండేవిధంగా తూర్పారబెట్టి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. గ్రేడ్ఏ ధాన్యానికి రూ. 2320, సాధారణ రకం ధాన్యానికి రూ.2300 మద్దతు ధర ప్రభుత్వం అందుస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని దళారులకు అమ్మకుండా ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వరి ధాన్య కొనుగోలు కేంద్రాలకే విక్రయించాలని కోరారు.ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ అధికారుల వద్ద ఉన్న వరి కోతల వివరాల ఆధారంగా రైతుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లేలా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, ఏవో సందీప్, అగ్రికల్చర్ అధికారులు, 11 వ వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్గురి వెంకటేశం గౌడ్, నంద్యాల శ్రీనివాస్ రెడ్డి, నంద్యాల బిక్షం రెడ్డి, నంద్యాల ప్రతాప్ రెడ్డి, తంగేళ్ళ రవికాంత్ రెడ్డి, కొప్పుల రాంరెడ్డి, గుర్రం వెంకట్ రెడ్డి, ఎల్గురి వీరయ్య గౌడ్, యలగబోయిన మధు యాదవ్, జంగిలి సైదులు, ఏండ్ల ఉపేందర్,మేకనబోయిన శేఖర్,మందడి రాంరెడ్డి, నారాయణ వీరారెడ్డి, గోపిరెడ్డి దామోదర్ రెడ్డి, గోపిరెడ్డి ఉపేందర్ రెడ్డి, మాలి నాగార్జున రెడ్డి పాల్గొన్నారు.



## ఘనంగా రేణుకా ఎల్లమ్మ ప్రతిష్టాపన వేడుకలు

**డోర్నకల్, విశాలభారతి:**
మరిపెడ మున్సిపాలిటీ పరిధిలో దేశ్య తండా నందు నూతనంగా నిర్మించిన ఆలయంలో గ్రామ దేవతలైన రేణుకా ఎల్లమ్మ మునిరాజు విగ్రాహాల ప్రతిష్టాపన మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రేణుకా ఎల్లమ్మమునిరాజు విగ్రహాలను గ్రామంలోని పురవీధుల్లో ఊరేగించారు. బంజారులు గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. తండాలోని బంజార మహిళలు బోనాలతో పురవీధుల్లో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి నైవేద్యం పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. పాడి పంటలతో చల్లంగా చూడుతల్లి అంటు గ్రామ దేవతలకు యాటలను బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి వెంకన్న మాజీ వార్డు మెంబర్ మంజీయా బానోతుబద్య బానోత్ బావుసింగ్, బానోతు నామ, సూర్య ,తదితరులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మార్వో

- బండ కవిత

**గరిడేపల్లి, విశాలభారతి:**
మండల కేంద్రంలోని సర్వారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహాశీల్దార్ బండ కవిత ప్రారంభించారు. మంగళవారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల పరిధిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు నందు పిఐసి చైర్మన్ జె.కమల తో కలిసి ప్రారంభించారు.రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి విక్రయించుకోవాలని అన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న మద్దతు ధర పొందాలని తెలిపారు.ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాకి రూ .2320,బి గ్రేడ్ ధాన్యానికి 2300 చొప్పున చెల్లించటం జరుగుతుందన్నారు. రైతులు వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రవీణ్,వ్యవసాయ శాఖ ఏఈఓ త్రివేణి,సంఘం కార్యదర్శి తవిడబోయిన గోపయ్య,సంఘ సిబ్బంది యడవెల్లి వెంకటేశ్వర్లు, ఉల్లెందుల సతీష్,సందీప్, రైతులు అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాతల నోటిలో మట్టి కొట్టిన వడగళ్ల వాన

**తొర్రూరు, విశాలభారతి:**
నోట్లో మట్టి కొట్టిన వడగళ్ల వాన తొర్రూర్ మండలంలో సోమవారం రాత్రి కురిసిన వడగండ్ల వానతో తొర్రూరు మండలంలోని హరిపిరాల, చీకటాయపాలెం, చెర్లపాలెం గ్రామాలతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో మామిడి తోటలు, వరి పంటలు బాగా దెబ్బతిన్నాయి.ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన మామిడి తోట రైతులు మాట్లాడుతూ కోతకు వచ్చిన మామిడికాయలు అమ్ముకునే సమయం లోనే అమ్ముకునే సమయంలోనే ఈ అకాల వడగండ్ల వానతో మామిడికాయలన్ని రాలి కింద పడటంతో తీవ్రంగా నష్టపోవడం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ వ్యవసాయ, ఉద్యాన



వన శాఖ అధికారులు తక్షణమే స్పందించి నష్టపోయిన మామిడి పంటలను పరిశీలించి రైతులను ఆదుకోవాలని అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు రైతుల యొక్క దీనస్థితిని ఆలోచించి నష్టపరిహారం ఇప్పించే విధంగా కృషి చేసి రైతులను ఆదుకోవాలని పలువురు స్థానిక రైతులు విజ్ఞప్తి చేశారు.



## గ్రామీణ ప్రాంతాల్లో పోషకాహార లోపాన్ని నివారించడమే లక్ష్యం

**తొర్రూరు, విశాలభారతి:**
పోషకాహార లోపంతో గ్రామీణ ప్రాంతాల్లో కనిపించకూడదు అనే లక్ష్యంతో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని మడిపల్లి గ్రామంలో నిర్వహించారు.గ్రామీణ ప్రాంతంలో పోషకాహార లోపంతో పిల్లలు కనిపించకూడదు అనే సదుద్దేశంతో పోషణపక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏసీడీపీఓలు ఇందిరమ్మ,విజయలక్ష్మిలు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సంయుక్తంగా మాట్లాడుతూ.. బాల, బాలికలకు, గర్భవతులకు,పేదవారి పిల్లలకు పేద మహిళలకు పౌష్టికరమైన ఆహారాన్ని అంగన్వాడీల ద్వారా అందించడం జరుగుతుందని, అంగన్వాడీ కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను అందిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మడిపల్లి గ్రామంలో పోషకాహార లోపంతో ఏ పిల్లవాళ్ళు కనిపించకూడదని ఉద్దేశంతో పోషణ పక్షం అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్ గౌసియా,గ్రామ సెక్రెటరీ శోభారాణి, అంగన్వాడీ టీచర్లు అరుణమ్మ, ఉదయశ్రీ,సుజాత అంగన్వాడి ఆయాలు సమ్మక్క, సరిత గర్భిణీలు బాలింతలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.



## భీమ్‌గల్ మండల ప్రత్యేక అధికారిగా జిల్లా పంచాయతీ అధికారి

**విశాలభారతి,బాల్గొండ:**
భీమ్‌గల్ మండల ప్రత్యేక అధికారిగా జిల్లా పంచాయతీ అధికారి డి.శ్రీనివాస్ రావ్ మంగళవారం భాద్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఎంపిడిఓ గంగుల సంతోష్ కుమార్,ఎంపిఓ సయ్యద్ జావీద్ అలీ,సీనియర్ అసిస్టెంట్ ప్రిన్స్,మండల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రావ్ ను శాలువతో సత్కరించారు.అనంతరం లింగాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను,నర్సరీను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసి,మండల అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ గంగుల సంతోష్ కుమార్,ఎంపిఓ సయ్యద్ జావీద్ అలీ,సీనియర్ అసిస్టెంట్ ప్రిన్స్,మండల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



## మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి

**విశాలభారతి,ఎల్కతుర్తి :**
హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఎల్కతుర్తి మండలం గోపాలపూర్, జగన్నాధపూర్ గ్రామాలకు చెందిన ఇద్దరు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. గోపాల్ పూర్ గ్రామానికి చెందిన బోయినపెల్లి అమృతమ్మ, జగన్నాధపూర్ గ్రామానికి చెందిన కంది మల్లమ్మ (కంది రవీందర్ రెడ్డి ముల్కనూర్ సహకార గ్రామీణ పరపతి సంఘం డైరెక్టర్ తల్లి) ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకొని, వారి చిత్ర పటాలకు పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపి కుటుంబ సభ్యులని ఓదార్చి, వారి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడు వారి కుటుంబానికి మనో ధైర్యాన్ని ప్రసాదించాలని అన్నారు.



## రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నాగం సుధాకర్ రెడ్డి

**నూతనకల్, విశాలభారతి:**
రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నూతనకల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగం సుధాకర్ రెడ్డి అన్నారు.నేడు నూతనకల్ మండలం అలుగునూరు గ్రామంలో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ ర్యాలీని ప్రారంభించి అంబేద్కర్, మహాత్మగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిగా విచ్చేసిన తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు దిక్సూచిగా నిలిచిన భారత రాజ్యాంగాన్ని కేంద్రంలోని బీజేపీ విచ్ఛిన్నం చేయడానికి కుట్ర పన్నుతోందని, రాజ్యాంగం ద్వార సంక్రమించిన ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కళ్లెం కృష్ణా రెడ్డి, దరిపెల్లి వీరన్న, కృష్ణా నాయక్ , మధు ,మండల కాంగ్రెస్ నాయకులు సైదులు గౌడ్, పసుల అశోక్ యాదవ్, బంటు బద్రీ,బంటు క్రాంతి, రాజాబహుదుర్ రెడ్డి, అనంతుల శ్రీను, ఇరుగు కిరణ్, గుణగంటి వెంకన్న, కుశలవ, సోమయ్య, మురళి, శ్రీకాంత్, ప్రశాంత్ రెడ్డి, సాయి, మడ్డి లింగయ్య, మన్నేం ధశరథతదితరులు పలుగొన్నారు.



## హోరెత్తిన జై బాపు.. జై భీమ్, జై సమ్మిదన్ నినాదాలు

- రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నది
- మండల పార్టీ అధ్యక్షుడు పెండ్లి రఘువీర్ రెడ్డి

**డోర్నకల్, విశాలభారతి:**
డోర్నకల్ నియోజకవర్గం మరిపెడ మండలంలో నీలుకుర్తి గ్రామపంచాయతీ నందు జై బాపు ,జై భీమ్, జై సమ్మిదన్ ,నినాదాలు గ్రామంలో హోరెత్యాయి. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీర్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇంద్రమ్మ రాజ్యంలో రెండు లక్షల వ్యవసాయ రుణమాఫీ, గృహజ్యోతి, మహాలక్ష్మి, ఉచితంగా 6 కిలోల సన్న బియ్యం ఇస్తున్న ఏకైక రాష్ట్రము తెలంగాణ రాష్ట్రమని. అంతేకాకుండా దేశ స్వతంత్రం నుండి నేటి వరకు జరుగుతున్న. రాజకీయ పరిణామాలను దృష్టిలో పెట్టుకొని నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వ పెద్దలైన నరేంద్ర మోడీ అమిత్యాలు కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేక మైనటువంటి కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు యుగంధర్ రెడ్డి, నియోజకవర్గ యూత్ జనరల్ సెక్రటరీ గాదేగాని నరేష్ గౌడ్ ,గ్రామ పార్టీ అధ్యక్షుడు గౌతం, పరకల్ జాల్ తండా గ్రామపంచాయతీ అధ్యక్షుడు కొండయ్య, మండల నాయకులు అబ్జల్, శ్రీ పాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాసం నిరుద్యోగులకు వరం లాంటిది

- కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఆరేళ్ల సైదులు

**మునుగోడు,విశాలభారతి:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని మార్చి నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. రాజీవ్ యువ వికాసం నిరుద్యోగులకు వరం లాంటిది మునుగోడు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆరేళ్ల సైదులు అన్నారు. నిరుద్యోగులు అందరూ ఈ సద్వినియోగం చేసుకోవాలన్నారు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవడానికి కులం సర్టిఫికెట్ రేషన్ కార్డ్ నంబర్ ఫోటో బ్యాంకు వివరాలు ఉంటే ఆదాయం సర్టిఫికెట్ సరిపోతుందన్నారు ఏప్రిల్ 14 చివరి తేదీ కావున ఆన్లైన్ లో లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని తర్వాత స్థానిక ఎంపీడీవో ఆఫీసులో ఆన్లైన్ లో చేసిన దరఖాస్తును ఇవ్వాలని లబ్ధిదారులకు తెలియజేశారు

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
బుధవారం,
09.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





# దొంతికి మంత్రి పదవి ఇవ్వాలి

- ఓయూ జాక్ కోకన్వీనర్ ఉంద్రాతి శ్రీను యాదవ్

**విశాలభారతి, ఓయూ:** నర్సంపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని కష్టాల్లో కాపాడిన దొంతి మాధవరెడ్డి మాత్రమేనని ఓయూ జాక్ కన్వీనర్ కో కన్వీనర్ ఉంద్రాతీ వీరుయాదవ్, శ్రీను యాదవ్ అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. తెలంగాణ ఉద్యమంలో కూడా నర్సంపేట నుండి కాంగ్రెస్ టికెట్ అశించి, టికెట్ రాకపోవడంతో ఇండిపెండెంట్ గా పోటీ చేసి గెలిచిన గొప్ప నాయకుడని, ప్రజలను నమ్ముకుని ఒకే పార్టీకి సేవ చేస్తున్న ప్రజల నాయకుడు దొంతి అని అన్నారు. తన జీవితాన్ని ప్రజా సేవకే అంకితం చేస్తు, ప్రజల సమస్యలు తీర్చడంలో గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ సారి నూతన మంత్రి వర్గ విస్తరణలో తప్పకుండా దొంతికీ మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. వెంట సతీష్, శ్రవణ్, నవీన్, లెనిన్, అశోక్, ఉమేష్, గని, అనిల్, శ్రీను పాల్గొన్నారు.




# న్యాయవాదిపై దాడిని ఖండిస్తూ విధులు బహిష్కరణ

**ఆమనగల్లు,విశాలభారతి:** హైదరాబాదులోని న్యాయవాది మహమ్మద్ ముజ్తబా అలీపై ఆదివారం జరిగిన దాడిని ఖండిస్తూ మంగళవారం ఆమనగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకార్ యాదిలాల్ ఆధ్వర్యంలో కోర్టు విధులను న్యాయవాదులు బహిష్కరించారు. గత రెండు రోజుల కింద హైదరాబాదులోని న్యాయవాదిపై దుండగులు విచక్షణారహితంగా కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్ కోర్టు వెంటనే ఏర్పాటు చేసి విచారణ జరిపి నిందితులకు శిక్ష విధించేల ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆమనగల్ బారసోసియేషన్ అధ్యక్షులు అండేకార్ యాదిలాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమనగల్లు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో న్యాయవాదులంతా ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు యాదిలాల్ మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులు సరికావుఅన్నారు. ప్రభుత్వం వెంటనే అడ్వకేట్స్ రక్షణ చట్టాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మల్లేపల్లి జగన్, బండెల సుధాకర్ రెడ్డి, అసోసియేషన్ ఉపాధ్యక్షులు రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి విజయ్ కుమార్, క్రీడ సంస్కృతిక కార్యదర్శి శేఖర్, కోశాధికారి కొప్పు కృష్ణ, గ్రంథాలయ కార్యదర్శి వస్పుల మల్లేష్, న్యాయవాదులు గణేష్, సంతోష్, మల్లేష్, దేవేందర్, శ్రీనివాస్, శిరీష్, సర్దార్ నాయక్ తదితరులున్నారు.



# ఘనంగా మానాల జన్మదిన వేడుకలు

**బాల్కొండ,విశాలభారతి:** భీమ్‌గల్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ చైర్మన్,నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి 57వ జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా హాజరైన పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొదిరే స్వామి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అనంతరావు,జిల్లా కార్యదర్శి బొజా గౌడ్,జిల్లా యువజన ఉపాధ్యక్షులు నాగేంద్ర,బాల్కొండ నియోజకవర్గం యువజన అధ్యక్షులు చరణ్ గౌడ్,మండల యువజన అధ్యక్షులు బద్దం అవినాష్,మహిళ అధ్యక్షురాలు దేశాయి కల్పన, దొనకంటి రాజేష్,నిచ్చం మహేష్,నిచ్చం మనోజ్,వాక శివప్రసాద్,విక్రం,అరికెల సాయిలు,నాగరాజ్,దొనకంటి కిషన్,జేమ్స్, గంగాధర్, చిన్నారెడ్డి,నితీష్,మాలవత్ రవి,లింబాద్రి,సతీష్,మల్లేష్,రాకేష్,అరుణ్,శ్రీను,భరత్,రమేష్,నవీన్,విశాల్,విజయ్,శంకర్,తదితరులు పాల్గొన్నారు.



జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ కాంగ్రెస్ పార్టీ ఊరురా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా మంగళవారం భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో కార్యకర్తలతో కాంగ్రెస్ మండల అధ్యక్షులు చిట్టెంపల్లి ఐలయ్య, సీనియర్ నాయకులు కేతిరి లక్ష్మారెడ్డి, చంద్రశేఖర్ గుప్తా, కొలుగూరు రాజు, ఊసకోయిల ప్రకాష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రారంభించిన ఎమ్మార్వో హరిప్రసాద్



**తిరుమలగిరి, విశాలభారతి;** తిరుమలగిరి మండల పరిధిలో తొండ గ్రామం లో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి ఈ సందర్భంగా మాట్లాడుతు రైతు పండించిన ప్రతి గింజ ప్రభుత్వ కొనుగోలు చేస్తుందని తెలిపారు. పండిన ప్రతి గింజల్లో రైతుల చెమట చుక్కలు ఉంటాయని గుర్తు చేసి, దళారుల చేతులో రైతులు మోసపోవద్దని సూచించిచారు. కార్యక్రమం మండల,గ్రామ అధికారులతో పాటు రైతులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.
- సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్.



**సూర్యాపేట,విశాలభారతి:** రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు ధర అందిం చాలానే సంకల్పంతో రైతులకు అందుబాటులో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సూర్యాపేట మండలంలోని ఇమాంపేట వద్ద ఐకేపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇమాంపేట 1, ఇమాంపేట 2, కేసారం ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు ఎన్ డిసిఎం ఎస్ ఆధ్వర్యంలో టేకుమట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులను నమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాల లో ధాన్యం విక్రయించుకోని ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర పొందాలని కోరారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2,320, బి గ్రేడ్ ధాన్యానికి రూ. 2,300 మద్దతు ధర ప్రభుత్వం అందించడం జరుగుతుందని తెలిపారు. 10 సంత్సరాల పాలనలో బిఆర్ఎస్ పార్టీ చేయని అభివృద్ధి ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపించడం జరిగిందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రవాణా తో పాటు ఎలాంటి ఇబ్బందులు ఎదురైన తమ దృష్టికి తీసుకువస్తే తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డితో మాట్లాడి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వెంటనే సమస్యను పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సన్న రకం ధాన్యానికి 500 రూపాయలు బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని తెలిపారు. అదే విధంగా నిరుపేదలు సైతం ఉన్నత వర్గాలు తినే సన్న బియ్యం తినిపించాలనే సంకల్పం తో కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం అందించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం లో డైరెక్టర్ బాలకృష్ణ, ఏపిఎం రణపంగి వెంకయ్య, సిసి సైదులు, ఏఈఓ స్వాతి, కార్యదర్శి జోష్న, కుంచం అంజయ్య, వాంకుడోత్ బాలాజీ, ఉపేందర్, నకిరెకంటి సతీష్, గోపాల్ రెడ్డి, చింత శ్రీను, పిల్లల రమేష్ నాయుడు, యాట ఉపేందర్, కర్ణాకర్ రెడ్డి, ధర్మానాయక్, గుండా ఉదయ్, దాసరి శ్రీను, సూరారపు రమేష్, గైని వెంకన్న, ఐకేపి సెంటర్ల నిర్వాకులు, తదితరులు పాల్గొన్నారు.

# పరశురామ పురస్కారానికి ముత్యంరాజు గురుస్వామి ఎంపిక



**సూర్యాపేట,విశాలభారతి:** కేరళ రాష్ట్రానికి చెందిన శ్రీ మలయాళ భగవతి పీఠం, పరశురామ వంశానికి చెందిన ఎస్ ఎస్ ఎస్ డివోషనల్ గ్రూప్, బ్రహ్మశ్రీ శివ నరసింహన్ తంత్రి శబరిమలలో అందజేయనున్న పరుశరామ్ పురస్కారానికి సూర్యాపేట జిల్లాకు చెందిన అయ్యప్ప స్వామి సీనియర్ గురుస్వామి రంగు ముత్యం రాజు గురుస్వామి ఎంపికైనారు. శ్రీ పరశురామ నిర్మితమైన శబరిమల శ్రీధర్మ శాస్తావారి సన్నిధిలో శ్రీ అయ్యప్పస్వామి వారి జన్మ నక్షత్రం పుట్టినరోజు అరట్టు ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 10వ తేదిన సిల్వర్ జూబ్లీ సంవత్సరంలో నిస్వార్థమైన అయ్యప్ప భక్తులకి, సేవకులకి శ్రీ పరశురామ పురస్కారం అవార్డు ఇచ్చి సత్కరించాలని సదుద్దేశముతో యావత్ భారతదేశంలోని అన్ని రాష్ట్రాల వారికీ జిల్లాకు ఒక్కరి చొప్పున ఎంపిక చేశారు. ఏప్రిల్ 10 నా శబరిమల కన్నెముల గణపతి వద్ద ఆంజనేయ ఆడిటరియంలో ఈ పురస్కరం అందజేయనున్నారు.ఈ కార్యక్రమంనకు ట్రావెన్కోర్ దేవస్థానం బోర్డు అధ్యక్షులు పి ఎస్ పార్ధసారధి, శబరిమల మేల్ శాంతులతో పాటు పలువురు ముఖ్యఅతిధిగా విచ్చేసి పురస్కారం ప్రదానం చేయనున్నారు.. ముత్యంరాజు గురుస్వామికీ అవార్డుకు ఎంపిక కావడం పట్ల పలువురు అయ్యప్ప స్వామి భక్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పరుశరామ పురస్కరంనకు ఎంపిక చేసిన ఎస్ఎస్ ఎస్ డివోషనల్ గ్రూప్ బ్రహ్మశ్రీ శివ నరసింహన్ తంత్రికీ కృతజ్ఞతలు తెలిపారు.

# పెంచిన వంట గ్యాస్ ధరను వెంటనే ఉపసంహరించుకోవాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు.




**సూర్యాపేట,విశాలభారతి:** కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ బండపై రూ. 50ని వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని నల్లాల బావి సెంటర్ లో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గ్యాస్ సిలిండర్లతో నిరసన వ్యక్తం చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరరూ 50కి పెంచడం మూలంగా గ్యాస్ ధర876 నుండి905 పెరగడం మూలంగా పేద, మధ్యతరగతి ప్రజలపై తీరని భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 సంవత్సరాల కాలం నుండి పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు గ్యాస్ ధరను ఇష్టానుసారం పెంచడం వల్ల ప్రజలపై మోయలేని భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక నిత్యవసర వస్తువులు ధరలు పెరిగి పెరిగిన ధరలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలపై ములిగే నక్కపై తాటి పండు పడ్డ చందంగా ధరల మీద ధరల తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలపై గ్యాస్ బండ మోపటం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. అంతర్జాతీయ వ్యాప్తంగా ఆయిల్ ధరలు తగ్గుముఖం పట్టినప్పటికీ దానికి అనుగుణంగా పెట్రోల్,డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాల్సిన మోడీ ప్రభుత్వం ఆయిల్ కంపెనీల లాభాల కోసం ప్రజలపై భారాలు మోపుతుందని ఆరోపించారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించేంతవరకు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏక లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు వేల్పుల వెంకన్న, ధనియాకుల శ్రీకాంత్ వర్మ, వీరబోయిన రవి, మేకన బోయిన శేఖర్, సిపిఎం పార్టీ వన్ టౌన్ కార్యదర్శి వల్లపు దాసు సాయి కుమార్, సిపిఎం పార్టీ టూ టౌన్ కార్యదర్శి పిండిగా నాగమణి, నాయకులు చిన్నపంగా నరసయ్య, మేకన బోయిన సైదమ్మ,బొమ్మిడి లక్ష్మీనారాయణ, ఉయ్యాల నగేష్, బోళ్లవెంకట్ రెడ్డి, వట్టె ఎర్రయ్య పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాలల్లో మద్దతు ధర

- ఎమ్మెల్యే మందుల సామేలు సామేలు

**శాలిగౌరారం, విశాలభారతి:** ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. నల్గొండ జిల్లా శాలిగౌరారం మండల పరిధిలో గురజాల, తుడిమిడి, చిత్తలూరు గ్రామాల్లో ఐ కె పి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మందుల సామేలు ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతు రైతు పండించిన ప్రతి గింజ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. పండిన ప్రతి గింజల్లో రైతుల చెమట చుక్కలు ఉంటాయని గుర్తు చేసి, దళారుల చేతులో రైతులు మోసపోవద్దని సూచించారు.ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటీ చైర్మెన్ పాదూరి శంకర్ రెడ్డి, వైస్ చైర్మన్ నరసింహ, తహసీల్దార్ యాదగిరి, ఎంపీడీఓ గార్లపాటి జ్యోతి, ఏపిఎం ధర్నెబోయిన రాములు, ఎంపీఓ సుధాకర్ ,మండల కాంగ్రెస్ అధ్యక్షులు కందాల సమరం రెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు అన్నెబోయిన సుధాకర్,ప్రధాన కార్యదర్శి గూని వెంకటయ్య, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వేముల గోపీనాథ్ మండల అధ్యక్షులు బోల్లికొండ గణేష్, ఎస్సీ సెల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు బోడ అరుణ్ ,మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు ఎర్ర చైతన్య, జై భీమ్ జై బాపు సంవిధాన్ మండల కోఆర్డినేటర్ భూపతి వెంకన్న,మాజీ సర్పంచ్ లు షేక్ ఇంతియాజ్, వెలుగు సీసీలు కాంగ్రెస్ నాయకులు రైతులు పాల్గొన్నారు.



# పాదాచారుల దాహం తీర్చడమే జలవికాస్ లక్ష్యం

**తొర్రూర్, విశాలభారతి:** మండలంలోని మడిపల్లి గ్రామంలో బాల వికాస అనుబంధ సంఘమైన జన వికాస సంఘం ఆధ్వర్యంలో మడిపల్లి మాజీ సర్పంచ్ నలుగురి రామలింగం సహకారంతో చలివేంద్రాన్ని బస్ స్టాండ్ సమీపంలో ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలవికాస ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని బాటసారులకు దాహాని తీర్చడం కోసమై చలివేంద్రం ఏర్పాటు అభినందనీయ అని అన్నారు. మహిళల సంక్షేమం కొరకు బాలవికాస ఆధ్వర్యంలో అనేక స్వచ్ఛంద సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బాలవికాస మెయిన్ కోఆర్డినేటర్ జలగం శైలజ,కోఆర్డినేటర్ శోభారాణి,అనిల్ రెడ్డి పుల్లయ్య గౌడ్, వీరస్వామి, దశరధ, రాములు,బాలవికాస సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ బిగ్గెస్ట్ ఎడ్యుకేషన్ ఫెయిర్ పోస్టర్ ఆవిష్కరణ

**ఎల్బీనగర్, విశాలభారతి:** తెలంగాణ బిగ్గెస్ట్ ఎడ్యుకేషన్ ఫెయిర్ పోస్టర్ నీ తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఐపీఎస్ చేతుల మీదుగా ఆర్టీసీ భవన్ లో ఆవిష్కరణ చేయటం జరిగింది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతు తెలంగాణతో పాటు దేశంలోని ప్రముఖ విద్యసంస్థలు పాల్గొనటం జరుగుతుంది, తల్లిదండ్రులు విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని బంగారు భవిష్యత్తుకీ బాటలు వేసుకోవాలని కోరటం జరిగింది. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు తెలంగాణ విద్య సమితి అధ్యక్షులు పెండెం తారక్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాసం

- అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం
- దరఖాస్తు గడువు ఈ నెల 14 వరకు పొడిగింపు
- మున్సిపాలిటీ, ఎంపిడిఓ కార్యాలయాల్లో ఆఫ్ లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచన
- వివరాలు వెల్లడించిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి



ఇబ్రహీంపట్నం,విశాలభారతి;

నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమైన రాజీవ్ యువ వికాసం పథకంను నూతనంగా ప్రారంభంచడం జరిగందని ఈ పథకం క్రింద అన్ని కార్పొరేషన్ లకు సంబంధించిన మార్గదర్శకాలను తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి రాజీవ్ యువ వికాసం పథకం సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తు చేసేందుకు రేషన్ కార్డు లేదా ఆహార భద్రత కార్డు ఉంటే సరిపోతుందని, ఆదాయ ధ్రువీకరణ పత్రం ఇవ్వాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. దరఖాస్తు గడువును ఈ నెల 14వ తేదీ వరకు పొడగించడం జరిగిందని, అన్ని మున్సిపాలిటీ,ఎంపిడిఓ కార్యాలయములలో ఆఫ్ లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలనీ కలెక్టర్ తెలిపారు. మండల, మున్సిపల్ కార్యాలయాల్లోని ప్రజాపాలన కేంద్రాల్లో దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పిడి డిఆర్డిఏ , ఈడి ఎస్సీ కార్పొరేషన్ అధికారులు నోడల్ అధికారులుగా ఉన్నారని, బ్యాంక్ మేనేజర్లు ఈ కార్యక్రమం పై ఒరియంటేషన్ కార్యక్రమం ఏర్పాటు చేయాలని అన్నారు.ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేయాలని,ఎల్.ఆర్.ఎస్. ప్రక్రియను కూడా వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.



# తెలంగాణ ఆత్మగౌరవపతాక బీఆర్ఎస్

- బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం చేయాలి
- మంచిరెడ్డి కిషన్ రెడ్డి
- కేసీఆర్ పాలన దేశానికే దిక్సూచి
- ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి , ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

ఇబ్రహీంపట్నం,విశాలభారతి:

బీఆర్ఎస్ రజతోత్సవం.. పాతికేండ్ల సమరోత్సాహమని, తెలంగాణ ఆత్మగౌరవపతాక బీఆర్ఎస్ పార్టీ అని ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే , రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.బీఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరగబోయే "రజతోత్సవ సభ" కార్యక్రమంపై రంగారెడ్డి జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు , మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అధ్యక్షతన ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎల్బీ నగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా జన సమీకరణ మరియు వివిధ అంశాలపై దిశానిర్దేశం చేసారు.

# రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తుల వెల్లువ

- అబ్దుల్లాపూర్ మెట్ మండలంలో 65 దరఖాస్తులు
- అప్లికేషన్ కోసం ఈనెల 14 వరకు మరో ఛాన్స్
- వివరాలు వెల్లడించిన అబ్దుల్లాపూర్ మెట్ ఎంపీడీవో శ్రీవాణి రెడ్డి



ఇబ్రహీంపట్నం,విశాలభారతి

నిరుద్యోగులకు స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని 14 గ్రామపంచాయతీల ద్వారా 65 అప్లికేషన్లు స్వీకరించబడ్డాయని ఎంపీడీవో శ్రీవాణి రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు గడువును ప్రభుత్వం ఈనెల 14 వరకు పొడిగించిందనీ తెలిపారు. ఆన్లైన్ దరఖాస్తు ప్రక్రియలో ఏవైనా సమస్యలు వస్తే అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిషత్ కార్యాలయములో ప్రజా పాలన సేవా కేంద్రం వద్ద సంప్రదించి లబ్ధిదారుని వివరాలను నమోదు చేసుకోవాలని వివరించారు.

# పటాన్ చెరులో గంజాయి పట్టివేత

- వ్యక్తి అరెస్టు




పటాన్ చెరు,విశాలభారతి:

పటాన్ చెరు పట్టణంలో ఒక వ్యక్తి వద్ద నుండి గంజాయిని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. అసిస్టెంట్ కమిషనర్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ మెదక్ డివిజన్ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమంగా గంజాయి అమ్ముతున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు మంగళవారం పటాన్ చెరు పట్టణంలోని గోకుల్ నగర్ లో ఒక ఇంటి లోపల గంజాయి అమ్ముతున్నారన్న సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఇంటి లోపల మొత్తం బరువు(756) గ్రాములతో ఒక వ్యక్తి పట్టుబడ్డాడని తెలిపారు. పట్టుబడిన వ్యక్తి నుండి ఒక మొబైల్ ఫోను సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు. సదరు పట్టుబడిన వ్యక్తి లాలన సహాని (45) అని, బీహార్ రాష్ట్రానికి చెందిన వాడని, ప్రస్తుతం అతను మేస్త్రిగా పనిచేస్తూ బీహార్ లో గంజాయి కొని ఇక్కడ అధిక ధరకు అమ్ముతున్నట్లు అధికారులు తెలిపారు. లాలన సహాని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ తనిఖీలో సీఐ బి.గాంధీ నాయక్, ఎస్ఐ బి. యాదయ్య, హెడ్ కానిస్టేబుల్ ఎండీ.అలీమ్, డి.సతీస్ మోహన్, కానిస్టేబుల్ కరీమా, జె.ప్రహ్లాద్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## అనారోగ్య కారణాలతో "ఆశా" కార్యకర్త మృతి



విశాలభారతి,భీమదేవరపల్లి:

మండలంలోని ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చంటయ్య పల్లె గ్రామానికి చెందిన "ఆశా" కార్యకర్త స్వరూప అనారోగ్య కారణాలతో మంగళవారం మృతి చెందారు. ఆమె మృతి పట్ల పిహెచ్సి వైద్యులు డాక్టర్ ప్రదీప్ రెడ్డి, వైద్య సిబ్బంది, వివిధ గ్రామాల ఆశా కార్యకర్తలు నివాళులు అర్పించారు. స్వరూప కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ, వారి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా తోటి ఆశా కార్యకర్తలు ఆమె చేసిన సేవలను కొనియాడుతూ, గుర్తు చేసుకున్నారు.

# సెంట్రింగ్ కార్మికుల సంక్షేమానికి కృషి

- మేకల సారంగపాణి.

సికింద్రాబాద్, విశాలభారతి :



సెంట్రింగ్ కార్మికుల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామని పలువురు నాయకులు పిలుపునిచ్చారు వారా సిగూడలో సికింద్రాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు యాదగిరి అధ్యక్షతన నామాలగుండు బిఎన్ఆర్ గార్డెన్ లో మంగళవారం సెంట్రింగ్ సంఘం సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కార్యాలయం ప్రారంభించారు. సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, కార్మికులు వారి సంక్షేమం కోసం ఇబ్బందులు కష్టాలపై యాదగిరి మాట్లాడారు...... సెంట్రింగ్ సంఘం కార్మికులంతా కలిసికట్టుగా ఉండాలన్నారు. ఐక్యమత్యంతో ఫ్యామిలీ మెంబర్స్ భవిష్యత్తు, పిల్లల భవిష్యత్తు కోసం తమ కార్మిక కార్మిక సెంట్రింగ్ సంఘం పని చేస్తుందని చెప్పారు. మీరందరూ మద్దతు కూడగట్టుకుని మనం సమాజానికి సేవ చేయాలని ఏమైనా సమస్యలు మన సంఘం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్మిక సంఘం నాయకుడు కుంచాల ఏడుకొండలు, కుంచాల ఏడుకొండలు, మేకల సారంగపాణి, కనకట్ల హరిలు మాట్లాడుతూ..... సెంట్రింగ్ కాంట్రాక్టర్లకు కార్మికులకు అండగా ఉంటామని అన్ని విధాలుగా వారిని ఆదుకుంటామని, వారి భవిష్యత్తు కోసం తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. అలాగే ప్రభుత్వం నుండి , వ్యాపారుల నుండి ,ఏలాంటి ఇబ్బందులు ఎదురైనా అండగ నిలబడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నాగేష్, అంజన్న, నర్సింగరావు, మల్లేష్, అంబల రాజేశ్వరరావు, సతీష్ రాజ్, హనుమంతు ముదిరాజ్, ఇవి నరేష్, అజయ్ నాయుడు సంఘం సభ్యులు కార్మికులు, హైదరాబాద్ సెంట్రింగ్ అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. వచ్చిన అతిథులందరినీ సెంట్రింగ్ అసోసియేషన్ వారు ఘనంగా సన్మానించారు. అలాగేసంఘం అధ్యక్షులు యాదగిరి ని ఈ కార్యక్రమానికి సహకరించిన కాంట్రాక్టర్లను అందరిని సన్మానించారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెద్ద అంబర్పేట్, విశాలభారతి:



హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదంలో వ్యక్తి ఒక మృతి చెందినట్లు ఇన్స్పెక్టర్ నాగరాజ్ గౌడ్ తెలిపారు. వివరాల్లోకి వెళితే మంగళవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో హయత్ నగర్ బస్ స్టాండ్ దగ్గర గల ఎమ్మార్వో ఆఫీస్ ముందు విజయవాడ హైవేలో ఎల్బీ నగర్ నుండి హయత్ నగర్ వైపు వస్తున్న ఒక ఆటోను (టిఎస్ 30 టి 1530) గల ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికీడు అదే దారిలో వెనుక నుండి అతివేగంగా అజాగ్రత్తగా వస్తున్నటువంటి లారీ ( టీఎస్ 07 యుఎన్ 6363 ) గల లారీ డ్రైవర్ ఆటోను ఢీ కొట్టింది. దీంతో ఆటలో ప్రయాణిస్తున్న భూగత ఎల్లయ్య తండ్రి పెంటయ్య వయసు 52 సంవత్సరాలు కాకతీయ నగర్ కాలనీ ఎల్బీనగర్ కు చెందిన వ్యక్తిగా అతనికి ఎడమ కాలికి మరియు శరీరం లోపల గాయాలు అవ్వగా అతన్ని 108 అంబులెన్స్ లో ఉస్మానియా హాస్పిటల్ కి తరలించారు. చికిత్స నిమిత్తం మంగళవారం మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో మరణించినట్లు తెలిసిందని అన్నారు. అలాగే ఆటో నడుపుతున్నటువంటి రేవెల్ల జంగయ్య అనే అతనికి స్వల్ప గాయాలు అయ్యాయని ఇట్టి సంఘటనపై మృతుని కుమారుని భూగత పరుశురాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని లారీ డ్రైవర్ను అదుపులోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు.



తెలంగాణ రాష్ట్ర అదనపు అడ్వకేట్ జనరల్ తెర రజినీకాంత్ రెడ్డిని మంగళవారం ఉదయం హైకోర్టులోని తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్నటువంటి అంశాలపై చర్చించినట్లు గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి తెలిపారు.



# నర్సరీలను సందర్శించిన జడ్పీ సీఈవో

- వేసవి తీవ్రత దృష్ట్యా ప్రతిరోజు నీరు పట్టి నర్సరీలను సంరక్షించాలి

విశాలభారతి,భీమదేవరపల్లి:

మండలంలోని భీమదేవరపల్లి, కొత్తపల్లి గ్రామాల నర్సరీలను జిల్లా పరిషత్ సీఈవో విద్యాలత మంగళవారం సందర్శించారు. నర్సరీలలోని వివిధ రకాల మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. ఉదయం, సాయంత్రం నీరు పోసి సంరక్షించాలని సూచించారు. రెండు గ్రామాలలో నర్సరీ రిజిస్టర్ లను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. వేసవి తీవ్రత దృష్ట్యా త్రాగునీటి సమస్యపై ఆరా తీశారు. జెడ్పి సీఈఓ వెంట మండల పరిషత్ అభివృద్ధి అధికారి వీరేశం, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.




# ఉద్యోగ భద్రతకై కాంట్రాక్టు అధ్యాపకుల నిరసన వ్యక్తం

విశాలభారతి,ఓయూ:

రాష్ట్రంలో 12 యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకి ఉద్యోగ భద్రత కల్పించాలని మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఉస్మానియా యూనివర్సిటీలో తరగతులు బహిష్కరించి యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ ముందు కాంట్రాక్టు అధ్యాపకులు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ విజేందర్ రెడ్డి, డాక్టర్ ధర్మతేజ మాట్లాడుతూ. ప్రభుత్వం తక్షణమే ఉద్యోగ భద్రతతో కూడిన స్కేల్ ఇవ్వాలని లేనిపక్షంలో యూనివర్సిటీ లలో మరో తెలంగాణ ఉద్యమంలా ఉద్యమాలు ఉదృతం చేస్తామన్నారు. రేపటినుంచి యూనివర్సిటీలలో తరగతులను బహిష్కరించి ఉద్యమం చేయాలనీ నిర్ణయించడం జరిగిందన్నారు. యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ సమస్య పరిష్కరించకుండా జి.ఓ 21ని తీసుకురావడం జరిగిందన్నారు.ఈ జీఓ యూజీసీ కి విరుద్దంగా ఉందని తక్షణమే జి.ఓ 21ని రద్దు చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ సీమర్ల విజేందర్ రెడ్డి, డాక్టర్ ధర్మతేజ, రేష్మారెడ్డి, డాక్టర్ మోడెమ్ రవి, డాక్టర్ ఓ. కృష్ణయ్య, డాక్టర్ తాలపల్లి వెంకటేష్, డాక్టర్ మహేందర్, డాక్టర్ అరుణ్, డాక్టర్ కిరణ్, డాక్టర్ అశోక్, డాక్టర్ వాణి, డాక్టర్ హరీష్, డాక్టర్ అర్జున్ తో పాటుగా ఓయూ కాంట్రాక్టు అధ్యాపకులు పాల్గొన్నారు.

# విద్యారంగంపై సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక శ్రద్ధ

- యూనివర్సిటీలో ఖాళీల నియామకం గైడ్ లైన్స్ విడుదల శుభపరిణామం
- ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు



పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:

రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులలో 50 శాతం ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించడం ద్వారా విద్యారంగంపై ఆయనకున్న శ్రద్ధను సూచిస్తుందని ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు అన్నారు. రాష్ట్రంలో ఏ రంగంలో ఎలాంటి సమస్యలు వచ్చినా తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవడం సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకత అని కొనియాడారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలో తగినంతమంది లెక్చరర్లు లేకపోవడం వల్ల న్యాక్ గ్రేడింగ్ తగ్గిపోయే ప్రమాదం పొంచి ఉందన్న విషయాన్ని ఇటీవల తాము సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ సమస్య తీవ్రతను గుర్తించిన సీఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించారన్నారు. రాష్ట్రంలోనే అన్ని యూనివర్సిటీలోని లెక్చరర్ పోస్టుల్లో 50% ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారని, ఈ మేరకు గైడ్లైన్స్ విడుదలయ్యాయి అన్నారు. సుమారు 10 ఏళ్లుగా యూనివర్సిటీలో లెక్చరర్ల నియామకం జరగలేదని, లెక్చరర్ల కొరత వేధిస్తుండముతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఎలాగైనా ఈ సమస్యను పరిష్కరించుకోవాలన్న గొప్ప ఆలోచన సీఎం రేవంత్ రెడ్డి చేశారన్నారు. ఇదిలా ఉండగా లెక్షరర్ పోస్టుల భర్తీ వల్ల తమ ఉద్యోగాలు పోయే ప్రమాదం ఉందంటూ కొంతమంది కాంట్రాక్ట్ లెక్చరర్లు, పార్ట్ టైం లెక్చరర్లు, అకడమిక్ కన్సల్టెంట్స్ , టైమ్ స్కేల్ అధ్యాపకులు తనను కలిసి ఆందోళన వ్యక్తం చేశారని, వారి సమస్యలను మానవతా దృక్పథంతో పరిశీలించి ఎలాంటి ఇబ్బంది లేకుండా సిఎం రేవంత్ రెడ్డికి వివరిస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు పలు రకాల చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందని, ఇదే సమయంలో అధ్యాపకుల బాగోగులు కూడా ఖచ్చితంగా దృష్టిలో పెట్టుకుంటామని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి చెప్పారన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక





## సిద్దుతో అట్లుంటది..!

సిద్దు జొన్నలగడ్డ ఇండస్ట్రీలో అడుగు పెట్టి చాలా సంవత్సరాలు అవుతోంది. దాదాపు దశాబ్ద కాలం స్ట్రగుల్స్ చూసిన సిద్దుకు ఫైనల్‌గా 'డీజే టిల్లు' సినిమాతో హిట్ పడింది. యూత్‌లో ఒక్కసారిగా టిల్లు గాడు అంటూ క్రేజ్ సొంతం చేసుకున్నాడు. ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో వెంటనే టిల్లు స్క్వేర్ సినిమా వచ్చింది. ఆ సినిమా కూడా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడం మాత్రమే కాకుండా నిర్మాత నాగ వంశీకి భారీ లాభాలు దక్కాయి. ప్రస్తుతం టిల్లు క్యూబ్ సినిమా కు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇదే సమయంలో సిద్దు నటించిన జాక్ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. 'జాక్' సినిమా ప్రమోషన్ సమయంలో సిద్దు జొన్నలగడ్డ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. కెరీర్‌లో సక్సెస్ లేని సమయంలో చాలా మంది అవమానించారు అంటూ సిద్దు చెప్పకొచ్చాడు. డీజే టిల్లు సినిమా షూటింగ్ సమయంలోనూ తాను కొన్ని సంఘటనలను ఎదుర్కొన్నట్లుగా చెప్పకొచ్చాడు. డీజే టిల్లు సినిమాకు విమల్ కృష్ణ దర్శకత్వం వహించాడు. ఆ సినిమాకి స్క్రిప్ట్, డైలాగ్స్‌ను సైతం సిద్దు అందించాడు. కీలక విషయాల్లో సిద్దు ఇన్వాల్వ్‌మెంట్ కీలకంగా ఉంటుంది. డీజే టిల్లు సినిమా విజయంలో ఎక్కువ శాతం క్రెడిట్ కచ్చితంగా సిద్దు జొన్నలగడ్డకు దక్కుతుంది అంటూ మేకర్స్ చెబుతూ ఉంటారు. ఆన్ లొకేషన్ డైలాగ్స్ ఇస్తూ వచ్చేవాడట. తాజాగా సిద్దు జొన్నలగడ్డ మాట్లాడుతూ... డీజే టిల్లు షూటింగ్ సమయంలో నేను దర్శకుడు విమల్ పక్కన కూర్చుని గట్టిగా నవ్వుకుంటూ ఉన్నాం. అది చూసిన మేనేజర్ నిర్మాత నాగవంశీ కి ఫోన్ చేసి వీళ్లు షూటింగ్ మానేసి పక్కకు వెళ్లి నవ్వుకుంటున్నారు అని చెప్పాడట. నిర్మాతకు మేనేజర్ కంప్లైంట్ గురించి సిద్దు ఫన్నీగా చెప్పాడు. ఆ సమయంలో తాము ఏదో విషయం గురించి మాట్లాడుకోవడం లేదని, సినిమాలోని కీలక సన్నివేశంలో వచ్చే డైలాగ్‌ను అప్పటికప్పుడు రాస్తూ నవ్వుకున్నామని చెప్పకొచ్చాడు. సినిమాలో నువ్వెళ్ల వాటర్ మిలాన్ ఆర్డర్ పెట్టుకుని చిల్ అవ్వు, ఈ శవాలను పాతి పెట్టడం నాకు అలవాటే అంటాడు హీరో. ఆ డైలాగ్‌ను దర్శకుడు విమల్‌కి చెప్పిన సమయంలో అతడు ఎక్కువగా నవ్వాడు. అది చూసి మేనేజర్ తప్పగా అర్థం చేసుకుని మేము షూటింగ్ మానేసుకుని జోకులు వేసుకుంటున్నామని అనుకున్నాడని సిద్దు చెప్పకొచ్చాడు. సిద్దుకు అప్పట్లో అంతగా క్రేజ్ లేదు కనుక ఏం చేసినా మేనేజర్ నుంచి అందరూ ఆయన్ను కాస్త చిన్న చూపు చూసేవారు అని దీన్ని బట్టి చెప్పకనే చెప్పాడు. ప్రస్తుతం సోషల్ మీడియాలో సిద్దు చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. సమయస్ఫూర్తితో సిద్దు చేసే వ్యాఖ్యలు, ఆయన అప్పటికప్పుడు రాసే డైలాగ్స్ బాగుంటాయని ఆయనతో వర్క్ చేసేవారు అంటూ ఉంటారు. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో రూపొందిన జాక్ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. మరి అంచనాలకు తగ్గట్లుగా సినిమా ఉంటుందా అనేది చూడాలి.



## అందాల స్టైలిష్ బాపు బొమ్మ

కన్నడ మూవీ పోర్కి సినిమాతో సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ ప్రణీత సుభాష్. కన్నడ సినిమాతో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ఈమె ఆ తర్వాత తెలుగు, హిందీ, తమిళ్, మలయాళం సినిమాల్లోనూ నటించింది. తెలుగులో 2010లో ఎమ్ పిల్లో ఎమ్ పిల్లాడో, బావ సినిమాల్లో నటించింది. ఎంట్రీ ఇచ్చిన ఏడాదిలోనే ఏకంగా మూడు సినిమాల్లో నటించిన ఈమె ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. సోషల్ మీడియాలోనూ ఈమెకు మంచి క్రేజ్ దక్కింది. టాలీవుడ్‌లో ఈమె చేసిన అత్తారింటికి దారేది సినిమాతో మంచి గుర్తింపు దక్కింది. ఆ సినిమాలో సమంత హీరోయిన్‌గా నటించినప్పటికీ ఈమెకు గుర్తింపు లభించింది. పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన ఆ సినిమాలో ప్రణీతకు బాపు బొమ్మ అంటూ సాంగ్ ఉంది. ఆ పాట కారణంగా ప్రణీతను తెలుగు ప్రేక్షకులు బాపు బొమ్మ అంటూ పిలుచుకుంటూ ఉంటారు. సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను, వీడియోలను షేర్ చేస్తూ ఉండే ప్రణీత సుభాష్ తాజాగా మరోసారి తన అందమైన ఫోటోలను, వీడియోలను షేర్ చేసింది. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్ ఈమె సొంతం అనే విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అందుకే ఈ అమ్మడు తెలుగులో మరిన్ని సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకుంటూ ఉంది. ఈమధ్య కాలంలో కాస్త స్లో అయింది అనిపించినా ముందు ముందు మరిన్ని సినిమాలు చేయనుందని ఈ ఫోటోలను చూస్తే అనిపిస్తుంది. ప్రణీత సుభాష్ సోషల్ మీడియాలో తాజాగా షేర్ చేసిన ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. మొబైల్‌లోని ఫోటోలను స్క్రోల్ చేస్తూ ఉంటే ఈ అందమైన ఫోటోలు కనిపించాయి అంటూ సరదాగా ఈ ఫోటోలను షేర్ చేసింది. ప్రణీతను ఈ క్లిక్స్‌లో చాలా స్టైలిష్ అవతార్‌లో చూడవచ్చు. అంతే కాకుండా ఈమె లుక్‌కు మంచి ప్రశంసలు దక్కుతున్నాయి. సోషల్ మీడియాలో ప్రణీత ఎప్పుడు ఫోటోలు షేర్ చేసినా కూడా వైరల్ కావడం మనం చూస్తూనే ఉంటాం. మరోసారి ఈ అమ్మడి అందాల ఆరబోత ఫోటోలు వైరల్ అయ్యాయి. అందాల స్టైలిష్ బాపు బొమ్మ ఫోటోలను షేర్ చేయడం ద్వారా అందరి దృష్టిని ఈ అమ్మడు ఆకట్టుకుంటోంది. స్టైలిష్ గాగుల్స్‌తో పాటు, సింపుల్ హెయిర్ స్టైల్‌తో బ్లూ షర్ట్ ధరించి ఒక స్పెషల్ ఫుడ్ ఐటెంను తింటున్న ప్రణీత సుభాష్ ఫోటో అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. పెళ్లి చేసుకుని తల్లి అయిన తర్వాత కూడా ప్రణీత సుభాష్ సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ వచ్చింది. ఈసారి స్కిన్ షో చేయకున్నా క్యూట్ అందం కారణంగా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దాదాపుగా ఆరున్నర మిలియన్‌ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న ఈ అమ్మడు షేర్ చేసే ప్రతి ఫోటోకు లక్షల్లో లైక్స్, కామెంట్స్ వస్తున్నాయి. ఈ ఫోటోలకు సైతం మంచి స్పందన దక్కింది. ఇంత అందంగా ఉన్న ప్రణీతకు మరికొంత కాలం సినిమాల్లో హీరోయిన్‌గా ఆఫర్లు రావాల్సిందే అంటూ ఆమె ఫాలోవర్స్ కామెంట్స్ చేస్తున్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.